తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# డిసెంబర్ ఆఖరుకు పద్మావతి సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు

**చిన్నపిల్లలకు గుండె చికిత్సలతోబాటు**

**న్యూరో, న్యూరోసర్జరీ, పల్మనాలజీ యూరాలజీ వైద్యం : టిటిడి ఇఒ ధర్మారెడ్డి**



తిరుమల, జూన్ 27ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతిలో అధునాతనంగా నిర్మితమవుతున్న పద్మావతి చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యసేవలను డిసెంబర్ నెలాఖరుకు అందుబాటులోకి తీసుకువస్తామని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ఉద్ఘాటించారు. ఈ ఆస్పత్రిలో చిన్నపిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతోబాటు న్యూరో, న్యూరోసర్జరీ, పల్మనాలజీ, యూరాలజీ తదితర సూపర్‌స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మంగళవారం తిరుపతిలో నిర్మాణంలో ఉన్న పద్మావతి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, టిటిడి జెఇఒ సదాభార్గవి, సిఇ నాగేశ్వరరావుతో కలసి పరిశీలించారు.

# శివయ్య సన్నిధిలో రష్యాభక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త



దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి స్వామిఅమ్మవార్లను దర్శించుకోవడం కోసం రష్యా నుంచి సుమారు 21మంది భక్తులు విచ్చేశారు. ఈసందర్భంగా వీరికి ఆలయ పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో స్వామఅమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆలయంలో శిల్పకళను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అనంతరం వీరికి స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందించి సత్కరించారు.

## అబద్ధపు హామీలతో

# చంద్రబాబు ప్రజలను మోసంచేశారు

**మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



రామకుప్పంలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం(రామకుప్పం), జూన్ 27 ప్రభాతవార్త

ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు గతంలో అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేశారని రాష్ట్ర అటవీ,గనులు, విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పల్లెబాట కార్యక్ర మంలో భాగంగా మంగళవారం రామకుప్పం మండలం 89 పెద్దూరు, ననియాల తాండా, వీర్నమల, బళ్ల, ఉన్సిగానిపల్లి, విజలాపురం, కెంచనబళ్ల, రామకుప్పంలో పర్యటించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 2014 ఎన్నికల సమయంలో 600హామీలు ఇచ్చిన చంద్రబాబు ఎన్ని అమలు చేశారని ప్రశ్నించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అమ్మఒడి పథకాన్ని నాన్న బుడ్డి అని అవహేళన చేసిన చంద్రబాబు నేడు అదే పథకానికి పేరుమార్చి అమలు చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. సిఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలు చేస్తున్నారన్నారు. రైతులు, ప్రజలు, యువత చదువుల కోసం ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. త్వరలోనే హంద్రీ-నీవా కాలువ పనులను పూర్తి చేసి నీరందిస్తామన్నారు. కుప్పం నుంచి ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తామన్నారు. అలాగే చిత్తూరు ఎంపిగా రెడ్డెప్పను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో కూడా ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కుప్పం ప్రజల వైపు కన్నెత్తి చూడలేదన్నారు. తన తండ్రి దివంగత డా॥ చంద్రమౌళి మృతి చెందిన అనంతరం తాను కుప్పంలోనే ఉంటున్నానని, నిరంతరం ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. అంతకుముందు మంత్రి పెద్దిరెడ్డికి గ్రామాల్లో మహిళలు, నేతలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ఎంపి రెడ్డెప్ప, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్,ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, పరిశీలకుడు రెడ్డెప్ప, సీనియర్ నేత ఎంఆర్‌సి రెడ్డి, రాష్ట్ర నేత మొగసాల కృష్ణమూర్తి, పికెఎం ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మండల కన్వీనర్ బాబురెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచులు బివి మురళి, మోహన్‌నాయక్, భ్కార్ నాయక్, గోవిందప్ప, నేతలు సెంధిల్, అప్పి, కుప్పం గంగమ్మగుడి ఛైర్మన్ కెఎ మంజునాథ్‌కుమార్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్,సర్పంచులు, నేతలు పాల్గొన్నారు.

# వైకాపాలో అందరూ 'రంగమార్తాండలే'

**బహిరంగ విమర్శలకు పాల్పడుతున్న అధికారపార్టీ నాయకులు.. పార్టీకి ఎలాంటి ముప్పు వాటిల్లుతుందో...**



తిరుపతిరూరల్ - ప్రభాతవార్త:

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 3దశాబ్దాల పాటు స్థిరపాలన అందించేందుకు అధినాయకుడు ప్రతిష్ట ప్రణాళికతో అధికారంలోకి వచ్చాడు. అదే తరహాలో నేతలు, నాయకులు, కార్యకర్తలు పార్టీ అధికారంలోకి వస్తే తమను నమ్ముకున్నవాళ్ళకు మేలు చేకూర్చుతామనే రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి, వైకాపా అధికారంలోకి రావటానికి నిరంతరాయంగా కృషి చేసారు. తీరా పార్టీ అధికారంలోకి వచ్చాక కనీసం అభిమాన అధి నాయకుడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునే దుస్థితి కూడా లేక పోయింది. ఆయా నియోజకవర్గం ఎమ్మెల్యే, అతని కుటుంబ సభ్యులు తప్ప, ఏ ఒక్క అభిమాని కూడా ఫ్లెక్సీల రూపంలో అభిమానాన్ని చాటుకునే పరిస్థితి లేకపోయింది. ఎమ్మెల్యేలు నిరంకుశంగా వ్యవహరిస్తూ పార్టీ తమదే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. వైకాపా పార్టీ ఏర్పడి నాటినుండి నేటి వరకు పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి, కష్టకాలంలో ఎదురొడ్డి నిలబడిన నాయకులు, కార్యకర్తలకు నేడు మొండి చెయ్యి ఎదురైతుంది. అభిమాన ముఖ్యమంత్రి తమ స్వంత నియోజకవర్గానికి వస్తున్న తరుణంలో కూడా కనీసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని సంతోషపడదామనుకున్న నాయకుల అల్పసంతోషానికి కూడా తావు లేకుండా పోయింది. స్థానిక నేత పలుకే బంగారమయ్యేనే చందంగా వ్యవహరిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని భుజస్కందాలపైన మోసిన నాయకులకు పార్టీలో ఆదరణ కరువైందా? నాయకుల మాటకు ఎక్కడా విలువ లేకుండా పోయిందా? వైకాపా అధికారంలోకి వస్తే ఆ నాయకులకు అధికార పార్టీ పెద్దపీట వేస్తారని ఊహించిన నాయకులకు భంగపాటు కలిగిందా? అధికారంలో ఉన్నామనే భ్రమలో ఉన్నారే తప్పా వారి మాటను దఫేదారు కూడా వినే పరిస్థితి లేదా. వైకాపా నాయకులు ఎందుకు నైర్యాంశంలో ఉన్నారు. నాయకుల మొఖాలలో నిరాశ, నిస్పృహాలు తప్ప ఎలాంటి ఆనందాలు లేవనే చెప్పాలి. నాయకులు పై పైకి మాత్రం గంభీర్యంగా ఉన్నా లోలోపల కుమిలిపోతున్నారు. వైకాపా నాయకుల మాట ఎక్కడా చెల్లుబాటు కాకపోవడంతో నాయకులు లో లోపల కృంగి కృషించిపోతున్నారు. ఊరిలో నాయకుడు మాటకు వాస్తవ లేనందున ప్రజలు కూడా నాయకుడు మాట వినే పరిస్థితి లేకపోగా ఈయన గారికి ప్రజాప్రతినిధి చెంత విలువ లేదంటూ మొఖం చాటేస్తున్నారు. గతంలో ఊర్లో స్థానిక నాయకులు దగ్గరుండి ఓట్లు వేయించి పార్టీని గెలిపిస్తే, నాలుగేళ్ళ కాలంలో స్థానిక నాయకునిచే ఏఒక్క పని కూడా చేయించుకోలేని దుస్థితి నెలకొనడంతో ఆ ఊర్లో నాయకునికి పూర్తిగా పరపతి పోయిందనే చెప్పాలి. వైకాపా నాయకులు స్థానిక ప్రజాప్రతినిధి వద్ద నటిస్తున్నారే తప్ప ఏ ఒక్కరూ విశ్వాస పాత్రులుగా లేరనే చెప్పాలి. ఎందుకు ఆ మాట అనాల్సి వచ్చిందంటే నాయకులు మాటలు, వ్యవహార శైలి, ప్రవర్తనలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఏ ఒక్క నాయకుడు ప్రజాప్రతినిధి పట్ల విశ్వాసం వ్యక్త పరచడం లేదు. అంతా నటిస్తూ జీవిస్తున్నారే తప్పా ఈ సారి నాయకుడుని గెలుపించుకోవాలనే ఆలోచన ఆత్రుత ఇసుమంతైన కనిపించ లేదనండంలో ఏలాంటి సందేహం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కరుడుకట్టిన ఉగ్రవాదులుగా పని చేసిన నేతలు పట్టభద్రుల నియోజకవర్గాల 3స్థానాలలో టిడిపి గెలువడంపై వైకాపా నేతలే సంబరపడ్డారు. పార్టీని అధికారంలోకి తెచ్చిన నేతలను పార్టీ విస్మరిస్తుందని ఆవేదన చెందుతున్నారు. వైకాపా నాయకులు సమిష్టిగా పనిచేయలేదని చెప్పుటానికి పట్టభద్రుల నియోజకవర్గాలలో మూడో చోట్ల టిడిపి గెలవడమే. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం వీరవిధేయులుగా పనిచేసిన ద్వితీయ, తృతీయ శ్రేణుల ఉనికి ప్రమాద స్థితిలో ఉంటడమే ఇందుకు నిదర్శనం. పేరుకే అధికార పార్టీ నాయకులు...కానీ వీరి మాట ఎక్కడా చెల్లుబాటు కావడం లేదు. ఇప్పటికైన పార్టీ అధిష్టానం పార్టీ కోసం కష్టపడిన, పార్టీ అధికారంలోకి రావటానికి కృషి చేసిన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులకు గుర్తించి, పార్టీలో సముచ్చిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉంది. మన నాయకులే కదా ఎక్కడికి పోతారూలే అనుకుంటే పొరబాటే....క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతుందో అధినాయకుడు గుర్తించాల్సి ఉంది. పార్టీ అధికారంలోకి రావటానికి సర్వేలపై సర్వేలు చేస్తున్న పార్టీ అధిష్టానం నాయకుల కష్టాన్ని గుర్తిస్తే పార్టీ మరోసారి అధికారంలోకి రావడం తథ్యం.

# సిఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు

**- బహిరంగ సభ, హెలిప్యాడ్‌ల ముందస్తు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీలు**

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:



చిత్తూరు నగరంలో జులై 4వ తేదీ జరుగనున్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డిలు ఆదేశించారు. కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మంగళవారం సిఎం పర్యటన సందర్భంగా జరిగే బహిరంగ సభ ప్రాంతం, హెలిప్యాడ్ ఏర్పాటు నిమిత్తం పోలీస్ పెరేడ్ గ్రౌండ్, మెసానికల్ గ్రౌండ్స్‌ను పరిశీలించారు. ఈ ఏర్పాట్లలో భాగంగా గంగినేని చెరువు పరిసరాల్లో వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలంను వారు పరిశీలించారు. అలాగే విజయ డెయిరీలో సిఎం పర్యటన నిమిత్తం జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించి మాట్లాడుతూ హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, విఐపి వెహికల్ పార్కింగ్, సిఎం పర్యటన రూట్ మ్యాప్‌లో గుర్తించిన విధంగా పార్కింగ్ ప్రదేశాల్లో బ్యారికేడింగ్, ర్యాంపుల ఏర్పాటు, హెలిప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన పనులను సత్వరం చేపట్టి పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో పాటు జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, తహసిల్దారు కిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భార్య ఆత్మహత్య చేసుకుందని

# భర్త ఆత్మహత్యాయత్నం

పూతలపట్టు, జూన్ 27 ప్రభాతవార్త:



ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన రాధ.

కుటుంబంలో చిన్నపాటి మనస్పర్థలతో గొడవలు పడి భర్తపై కోపంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం పాల్పడటం, ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం ఈ విషయం తెలిసిన వెంటనే భర్త పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నంకు ప్రయత్నించడం మంగళవారం పూతలపట్టులో సంచలనం కల్గించింది. పూతలపట్టు మండలం ఆకనంబట్టు పంచాయతీ రంగాపురంకు చెందిన యువరాజ్, రాధలు భార్యభర్తలు. వీరికి వివాహం జరిగి ఐదు సంవత్సరాలు అవుతుండగా వీరికి నాలుగు సంవత్సరాల కుమారుడు వున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తలైన యువరాజ్, రాధలు తరచు గొడవలు పడేవారు. మంగళవారం తెల్లవారుజాము సైతం ఓ విషయంపై భార్యభర్తలిద్దరు ఘర్షణ పడ్డారు. ఇంతలో స్కూల్‌కు సమయం అయ్యిందని తన కుమారుడిని స్కూల్‌కు సిద్ధం చేసి ప్రైవేటు స్కూల్ వాహనంలో స్కూల్‌కు పంపి ఇంటికి వచ్చిన భార్య రాధ తమ కొళ్ళఫారంలో వున్న పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. రాధ పురుగుల మంది సేవించి ఆత్మహత్యాయత్నంకు పాల్పడిందని తెలుసుకొన్న భర్త యువరాజ్, అతని కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిగా చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భార్య మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే భర్త యువరాజ్ ఇంటి వద్ద పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు అతనిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## కన్నుల పండువగా

# కల్యాణ వెంకన్న పార్వేట ఉత్సవం



చంద్రగిరి, జూన్ 27 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి పార్వేట ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు మార్గంలోని పార్వేట మండపం వద్ద మంగళవారం అర్చకులు స్వామి వారి పార్వేట ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు ఆలయం నుండి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకువచ్చారు. క్షేమతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా దుష్టశిక్షణ కోసం స్వామివారు మూడు సార్లు బళ్ళెంను ప్రయోగించారు. తదుపరి స్వామివారికి ఆస్థానం సమర్పించి, భక్తులకు తీర్ధప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్వమూర్తులను తిరిగి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్స్ నర్రా మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, అర్చకులు శేషాచార్యులు, నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ద్రౌపదీదేవి కళ్యాణం

శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించబడుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా ద్రౌపదమ్మ కళ్యాణం నిర్వహించారు. ఆలయ ఆవరణను ఓ కళ్యాణ వేదికగా ముస్తాబు చేశారు. మామిడి తోరణాలు, అరటి చెట్లుతో చక్కగా తీర్చి దిద్దారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా మన సంప్రదాయాన్ని అద్దం పట్టే విధంగా ముస్తాబు చేశారు. వేదపండితులు వేద మంత్రాల్ని ఘోషిస్తుండగా సంప్రదాయ బద్దంగా కళ్యాణ తంతును ప్రారంభించారు. ఆలయ పూజారి దయానందం సూచనలతో పురుషోత్తం కార్యక్రమాల్ని నిర్వహించారు. ద్రౌపదీ దేవిని వధువుగా ముస్తాబు చేశారు. అర్జునుని వరుడుగా ముస్తాబు చేసి కళ్యాణ మండపం వద్దకు వేదమంత్రాలతో మేళ తాళాలు మంగళవాయిద్యాలతో చేర్చారు. ఇక్కడ హోమాలు, కళ్యాణ మంత్రాలు, సంప్రదాయ బద్దంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ దర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు డెప్యూటీ ఇఒ వెంకటసుబ్బయ్య,ఎసి మల్లికార్జున్ ప్రసాద్, చిన్న ఆలయాల ఇన్‌చార్జి వెంకటస్వామి,ఎఇఒ లోకేస్ రెడ్డి ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించారు. కళ్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. వేదపండితుడు అర్ధగిరి వేదమంత్రాల్ని పఠిస్తుండగా ఉభయదారులు హాజరు కాగా కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తరువాత గ్రామోత్సవం జరిపారు.



# వాకాడులో లోకేష్‌కు ప్రజల నీరాజనాలు

వాకాడు, జూన్ 27, ప్రభాతవార్త

తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్‌కు మహిళలు హారతులు పట్టారు. మంగళవారం వాకాడు బిసి కాలనీ నుండి అశోక పిల్లర్ సెంటర్ వరకు లోకేష్‌కు ప్రజల నీరాజనలు పట్టారు. పలుచోట్ల భారీ స్థాయిలో క్రేన్ ద్వారా లోకేష్‌కు పూలమాలలు వేసి ఘనంగా నాయకులు సత్కరించారు. భారీ స్థాయిలో బాణ సంచాలు నాయకులు మారుమోగించారు. బిసి కాలనీ నుండి అశోక పిల్లర్ వరకు మహిళలు లోకేష్‌కు హారతులు నీరజనాలు చేపట్టారు. లోకేష్ వెంట మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, పార్టీ నాయకులు కొండేటి గంగా ప్రసాద్, వాకాడు టిడిపి మండల కమిటీ వున్నారు.

## జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన

# 21 క్లైములకు రూ. 1.81 కోట్లు ఆమోదం

**కలెక్టర్ వెంకటరమణారెడ్డి**



తిరుపతి కలెక్టర్, జూన్ 27, ప్రభాతవార్త

పిఎంఈజిపి రుణాలను సకాలంలో గ్రౌన్డింగ్ చేయాలని, పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉపాధి కార్యక్రమం పై సమీక్షిస్తూ పెండింగ్ దరఖాస్తుల గ్రౌన్డింగ్, ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించబడిన లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికబద్ధంగా పని చేయాలని, ఎల్‌డిఎం వాటికి అనుబంధ బ్యాంకులు లోన్లు ఇచ్చేలా సత్వరమే గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ 2023 నుంచి 146 పరిశ్రమలకు గాను 124 అనుమతులు ఇచ్చామని మరో 22 పరిశీలనలో ఉన్నాయన్నారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 21 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ.1.81 కోట్లు అందించడానికి నేడు ఆమోదం తెలిపారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ఏర్పేడు మండలం మధవమాల కింద ఫుడ్ కార్వింగ్ క్లస్టర్, కాపర్ వేజెల్స్ క్లస్టర్ ఎర్రమరెడ్డిపాలెం, రేణిగుంట మండలం, వెంకటగిరి శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్, నారాయణవనం పవర్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యలు పురోగతిపై సమీక్షించారు.కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపిఐఐసి తిరుపతి, నాయుడుపేట చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డిప్యూటీ చీఫ్ ఇన్స్ఫెక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్ రామకృష్ణ రెడ్డి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సెంటిమెంట్ 'దేశం'కు వర్కవుట్ అవుతుందా!

**- కాంగ్రెస్, వైకాపా తరహాలో పూతలపట్టు 'దేశం'లో కొత్త ముఖం**

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు 2009, 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేసి విజయం సాధించిన వ్యూహంను 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అనుసరించి విజయం సాధించడానికి సిద్ధమైంది. ఈ క్రమంలో రాజకీయాలకు ఏ మాత్రం అనుభవం లేని కొత్త ముఖంను పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జీగా మురళీమోహన్‌ను నియమించింది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కొత్తగా పూతలపట్టు, యాదమరి, ఐరాల, తవణంపల్లి, బంగారుపాళ్యం మండలాలతో పూతలపట్టు నియోజకవర్గం ఏర్పాటు అయ్యింది. ఈ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుండి ఒకసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందిన వ్యక్తికి ఆ పార్టీ అధిష్టానం మరోసారి జరిగే ఎన్నికల్లో అభ్యర్థిత్వం ఇవ్వకుండా కొత్త వ్యక్తికి అవకాశం కల్పించి ఆ ఎన్నికల్లో విజయం సాధించి నియోజకవర్గంను తన కంట్రోల్‌లో వుంచుకొనేది. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ అనుభవం లేని కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పి.రవి తెలుగుదేశం అభ్యర్థి లలితకుమారిపై 951 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2014లో మరోసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పలమనేరుకు చెందిన డాక్టర్ సునీల్ తెలుగుదేశం అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే లలితకుమారిపై 902 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం సాధించి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలుగుదేశం అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే లలితకుమారిపై 29,163 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఈ సెంటిమెంట్‌ను ప్రస్తుత ఎన్నికల్లో అమలు చేయాలని నిర్ణయించిన ప్రతిపక్ష తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా ఏ మాత్రం రాజకీయ అనుభవం లేని పూతలపట్టు మండలం గొడుగుచింత గ్రామంకు చెందిన మురళీమోహన్‌ను ఖరారు చేసి ఎన్నికల సంగ్రామంలోకి వెళ్ళాలని ఇప్పటికి నిర్ణయించింది. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కొత్త ముఖంను ఎన్నికల బరిలో నిలపి విజయం సాధించాలని పక్కా వ్యూహంతో అడుగులు వేస్తుండటంతో అధికార వైకాపా సైతం ఇది వరకు అమలు చేసిన సెంటిమెంట్‌ను అమలు చేసి కొత్త అభ్యర్థిని ఎన్నికల రంగంలోకి నిలుపుతుందా! లేక సెంటిమెంట్‌ను బ్రేక్ చేసి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు మరొకసారి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం ఇస్తుందా! చూడాల్సి వుంది.

## శ్రీరాధా రుక్మిణి సమేత శ్రీకృష్ణ ఆలయంలో నేడు మహాకుంభాభిషేకం

**పాలసముద్రం, జూన్ 27 ప్రభాతవార్త:**

పాలసముద్రం మండలం శ్రీకావేరిరాజపురం పంచాయతీలో బుధవారం శ్రీరాధా రుక్మిణి సమేత శ్రీకృష్ణ సమేత ఆలయ మహాకుంభాభిషేకం జరుగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయంలో నవగ్రహ శాంతి అర్చన, హోమం, ద్వితీయ కాల యాగశాల పూజ, దుర్గహోమం, ముడవకాల యాగశాల పూజ నిర్వహించారు. మహాకుంభాభిషేకంలో భాగంగా బుధవారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నారు.

## జగనన్న సురక్ష పథకంను విజయవంతం చేయాలి

**- జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి**



**పెద్దపంజాణి, జూన్ 27 ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఒగా ప్రారంభించిన జగనన్న సురక్ష పథకంను విజయవంతం చేయాలని జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా పలు రికార్డులు తనిఖీ చేశారు.ఎంపిడిఒ, ఎఒ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కెంపేగౌడ 514వ జయంతి వేడుకలు

**కుప్పంరూరల్, జూన్ 27 ప్రభాతవార్త**



కర్ణాటక రాజధాని బెంగళూరు నగరం సృష్టికర్త కెంపేగౌడ 514వ జయంతి వేడుకలను మంగళవారం కుప్పం నియోజకవర్గ వక్కలిగర సంఘం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కెంపేగౌడ చిత్రపటాన్ని పుష్పపల్లకిలో డప్పు వాయిద్యాల నడమ పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గుడుపల్లె రోడ్డులో వెలసిన శ్రీ చాముండేశ్వరి ఆలయం నుంచి పెద్ద ఎత్తున ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండులో కేక్ కట్ చేసి అంబికా కళ్యాణ మండపంలో అన్నదానం చేశారు. వెయ్యి మంది మహిళలకు ఉచితంగా చీరలు పంచారు. కార్యక్రమంలో జడ్పీచైర్మన్ శ్రీనివాసులు, వక్కలిగర ఛైర్మన్ నళిని రంగేగౌడు,అధ్యక్షులు ఎంఎల్ రాజగోపాల్, ఉపాధ్యక్షులు జడ్పీటిసి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు అశోక్‌కుమార్, కార్యదర్శి వేణు,జడ్పీటిసి కృష్ణమూర్తి, హేమాంబరగౌడు, డిఎం వెంకటాచలం గౌడు, తులసికుమార్, సుబ్రమణ్యం, ఉమేష్, నారాయణ, రామూర్తి, వరదరాజులు, పాండురంగప్ప, మాజీ ఎంపిపి రంగనాథ్ గౌడు, వక్కలిగర కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బధిరుల కోసం హెలెన్ కెల్లర్ చేసిన కృషి అమోఘం

**కుప్పంరూరల్, జూన్ 27 ప్రభాతవార్త**



మూగ,చెవిటి బధిరుల కోసం హెలెన్ కెల్లర్ చేసిన కృషి అమోఘమని ఎస్సై శివకుమార్, విక్టరీ బోర్డింగ్ స్కూల్ వ్యవస్థాపకుడు గోవిందరాజులు పేర్కొన్నారు. మంగళవారం హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా కుప్పంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెవులు ఉన్నా వినలేని, నోరు ఉన్నా మాట్లాడలేని మూగతనం, ప్రకృతిని చూడలేని కళ్లు కలిగిన దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు హెలెన్ కెల్లర్ ఎంతగానో కృషి చేశారని ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడుడా॥ మహేష్, మహ్మద్‌పురం సర్పంచ్ నాసిర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రాగి,చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహకాలు

**శాంతిపురం, జూన్ 27 ప్రభాతవార్త**

రాగి, కొర్ర, సామ పంటల సాగుకు ప్రోత్సాహకాలు అందించడం జరుగుతోందని ఎఒ అప్పోజి తెలిపారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజనులో జిల్లా కలెక్టర్, డిఎఒ ఆదేశాలతో 1140 హెక్టార్ల రాగి పంట సాగు చేయాలని రైతులను కోరారు. ప్రతి ఆర్‌బికెల పరిధిలో వందశాతం రాయితీతో రాగి విత్తనాలు అందించడంజరుగుతుందని ఒక్కో రైతుకు 2 కిలోలు అందిస్తామన్నారు. అలాగే అంతరపంటగా కందిసాగు చేపట్టవచ్చన్నారు. రాగి పంటను ప్రభుత్వమే 38రూ.ల ధరకు కొనుగోలు చేస్తుందన్నారు.

## చిత్తూరు మరింత అభివృద్ధికి కంకణం

**- మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో మేయర్ అముద**



**చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:**

చిత్తూరు నగరంను మరింత అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకొని విధులు నిర్వర్తించాలని మేయర్ అముద పిలుపునిచ్చారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమావేశపు భవనంలో మంగళవారం మేయర అముద అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డిప్యుటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు, కార్పొరేటర్లు, కో-అప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మేయర్ మాట్లాడుతూ అందుబాటులో వున్న నిధులను వినియోగించుకొని నగర పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి చేపట్టాలన్నారు. కాంట్రాక్టర్లు వీలైన మేరకు ఎక్కువ పనులు చేపట్టడానికి ముందుకు రావాలన్నారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ జిజిఎంపి, 15 ఫైనాన్స్ నిధులు అందుబాటులో వున్నాయని, ఈ నిధులతో విస్తృతంగా అభివృద్ధి చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు వారి డివిజన్ పరిధిలో ప్రతిపాదించిన పనులను సమావేశం ఆమోదించింది. అలాగే నగర పాలక సంస్థ ద్వారా పెట్రోల్ బంకు ఏర్పాటుకు కొంగారెడ్డిపల్లి పూలమార్కెట్, సంతపేట వద్ద స్థలం కేటాయింపుకు సమావేశం ఆమోదం తెలిపింది. అలాగే టేబుల్ అజెండా కింద మంగసుముద్రం రెవెన్యూ గ్రామంలో పిఎస్సీ మున్సిపల్ పాఠశాల ప్రక్కన కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్మాణానికి 8 ఎకరాల స్థలం కేటాయిస్తూ సమావేశం తీర్మానం చేసింది. అలాగే కైలాసపురం స్మశాన వాటికలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్ చిత్తూరు వారి ద్వారా క్రిమినేషన్ మిషన్ ఏర్పాటుకు సమావేశం ఆమోదించింది.మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మిగులు భూములు పేదలకు పంపిణీకి చర్యలు

**- గ్రామాల్లో 12 మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు - నాడు-నేడు పనులు మరింత వేగవంతం**

**- పాలసముద్రం మండల సర్వసభ్య సమావేశం**

**పాలసముద్రం, జూన్ 27 ప్రభాతవార్త:**

భూములు రీ-సర్వే అనంతరం మిగులు భూములను భూములు లేని నిరుపేదలకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు రెవెన్యూ అధికారులను కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ మండల పరిధిలో 13 గ్రామ పంచాయతీలు వుండగా ప్రస్తుతం 6 పంచాయతీల్లో రీ-సర్వేపనులు పూర్తి అయ్యాయని, మిగిలిన గ్రామాల్లో సైతీ రీసర్వే పనులు పూర్తి చేసి మిగులు భూములుగా గుర్తించిన వాటిని అర్హులైన భూములు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. రీ-సర్వేకు సంబంధించి ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే న్యాయ పోరాటం చేసి అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకొంటామన్నారు. మండలంలో 12 మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. మండలంలో నాడు-నేడు పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ఉన్నత అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్నాయని క్షేత్ర స్థాయి అధికారులు పక్కాగా పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఎంపిపి కోరారు. జడ్పీటిసీ అన్బుగలన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్స్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఆరోపించారు. సభ్యులు మాట్లాడుతూ మండలంలో పలుచోట్ల విద్యుత్ సమస్యలు వున్నాయని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ప్రేమ్‌రాజ్‌కుమార్, డిప్యుటీ తహసిల్దారు మధుబాబు, జిల్లా వ్యవసాయ అభివృద్ధి మండలి సభ్యులు శివప్రకాష్‌రాజు, పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఎంఇఒ రాజేంద్రప్రసాద్, వైస్ ఎంపిపి శేఖర్‌మండడి, ఎంపిటిసీలు గోవిందరాజులు, వ్యవసాయ ఎఒ ఢిల్లీప్రసాద్, ఫారెస్ట్ బీటు ఆఫీసర్ సుభాషిణి, ఇఒఆర్డీ రమేష్, సర్పంచ్‌లు అయ్యప్ప, తంగరాజు, రమేష్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాల లక్ష్యాలు పూర్తికి చర్యలు



**- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**

**బంగారుపాళ్యం, జూన్ 27 ప్రభాతవార్త:**

జగనన్న లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి త్వరితంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. బంగారుపాళ్యం ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం జెసి శ్రీనివాసులు ఇళ్ళ నిర్మాణాలపై సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సంబంధిత సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ పేదవాడి సొంత ఇంటి కల సకారం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇళ్ళ నిర్మాణాల కార్యక్రమం చేపట్టిందని, ఈ పథకంలో లబ్దిదారులకు మంజూరు చేసిన ఇళ్ళ నిర్మాణాలు త్వరితంగా పూర్తి చేయడానికి లబ్దిదారులకు పూర్తి సహకారం అందించాలన్నారు. బంగారుపాళ్యం మండలంలలో మొత్తం 3,184 ఇళ్ల మంజూరు అయితే 119 ఇళ్ళకు స్టేజ్ కన్వర్షన్ జరిగిందని హౌసింగ్ అధికారులు జెసికి వివరించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి పద్మనాభం, డిఇ సుబ్రమణ్యం, ఎఇ గుణశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం**

## గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

**కాణిపాకం, జూన్ 27 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు మంగళవారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు హైదరాబాద్, బోడబండ్లకు చెందిన నీలా శ్రావన్ అనే భక్తుడు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ రంగస్వామి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ,ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

**తవణంపల్లె, జూన్ 27 ప్రభాతవార్త:**

మండలంలోని కట్టకిందపల్లె గ్రామ సమీపంలోని బహుదానది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం ఉదయం దాడి చేసి పట్టుకుని సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై పి.వి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. కట్టకిందపల్లె గ్రామ సమీపంలోని బహుదానది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలసి దాడి చేసి గోవిందరెడ్డిపల్లెకు చెందిన కెఎస్‌జి.అమర్‌నాథరెడ్డి అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు.

## బోయకొండలో గోబర్‌గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు : జడ్పీ సిఇఓ

**బోయకొండ(చౌడేపల్లి), జూన్ 27 ప్రభాతవార్త**



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద గోబర్‌గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకొం టున్నట్లు జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన గంగమ్మను దర్శించుకొన్నారు. అనంతరం కొండకిందగల గోశాలను పరిశీలించారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి ఆదేశాల మేరకు గోశాల వద్ద రూ. 50లక్షలతో గోబర్‌గ్యాస్ తయారీ ప్లాంట్‌ను పైలట్‌యూనిట్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. సఫలీకృతమైతే కొండకు వచ్చే యాత్రీకులకు ఉపయోగకరంగా వుంటుందన్నారు. ధర్మవరం పరిశీలకుడు పెద్దిరెడ్డి, రాష్ట్ర పాల ఏకిరిల కార్పోరేషన్ సభ్యుడు లడ్డు రమణ, మంత్రి పెద్దిరెడ్డి పిఏ మునితుకారామ్, ఇఒ చంద్రమౌళి, డిష్‌సూరి, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## జడ్పీ సిఇఓచే ఆకస్మిక తనిఖీ

**చౌడేపల్లి, జూన్ 27 ప్రభాతవార్త**



స్థానిక మండల పరిపాలనా భవన సముదాయంలోని ఎంపిడిఓ కార్యాలయాన్ని జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేసారు. కార్యాలయంలోని పలు రికార్డులు తనిఖీ చేసి తన సంతృప్తిని వ్యక్తం చేసారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను గురించి ఆరా తీసారు. నిర్మాణంలో వున్న పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎంపిడిఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాలో అన్నదమ్ములు అరెస్టు

**గంగవరం,జూన్ 27 ,ప్రభాతవార్త :**



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరు అన్నదమ్ములను అరెస్టు చేసి,రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.మంగళవారం పలమనేరు రూరల్ మండలం జర్రావారిపల్లె పంచాయతీ పందేరుపల్లె వద్దూరుకు చెందిన వెంకటేష్ కుమారులు నాగరాజు(23),కిరణ్(19)లు ఇద్దరు కలిసి తమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి పొలం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అందిన సమాచారం మేరకు సిబ్బంది దాడి చేసి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అన్నదమ్ములు నాగరాజు,కిరణ్‌లపై కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

**గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు**

## 98 డీఎస్సీ విజేత వెంకటరమణయ్యకు సత్కారం

**వాకాడు, జూన్ 27, ప్రభాతవార్త**



వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం శ్రీ పట్టాభిరామాలయంలో శ్రీ రామసేన ఆధ్వర్యంలో మంగళవారం వాకాడు సొసైటీ చైర్మన్, ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోదిరెడ్డి చేతులు మీదుగా 1998 డీఎస్సీ విజేత, గత ఏప్రిల్ నెలలో ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించిన నూతన పాటి వెంకటరమణయ్యను పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కొడవలూరు దామోదర రెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 98 డీఎస్సీలో అర్హులైన వారికి ఇచ్చిన ఉపాధ్యాయ ఉద్యోగులలో వాకాడు మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన నూతనపాటి వెంకటరమణయ్య కూడా ఉండడం సంతోషమని తెలిపారు. శ్రీరామసేన అధ్యక్ష, కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డి, పోలిపాటి శివకుమార్ సభ్యులు శివకుమార్, శేషాద్రి శర్మ, సుబ్రమణ్యం శర్మ, నరేష్ శర్మ, విజయభాస్కర్, దినేష్, వంశీ, వినయ్, మోహన్, మురళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మోటార్‌సైకిల్ బోల్తా- ఇద్దరికి తీవ్రగాయాలు

**నాయుడుపేట రూరల్ జూన్ 27 ప్రభాతవార్త ;**

నాయుడుపేట మండలంలోని శ్రీనివాసపురం సమీపంలో మోటార్‌సైకిల్ బోల్తాపడి ఇద్దరు యువకలు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది.సేకరించిన సమాచారం మెరకు వివరాలిలా ఉన్నాయి. సూళ్ళూరుపేటకు చెందిన ఉదయ్‌కుమార్,అశోక్‌లు మోటార్‌సైకిల్‌పై నాయుడుపేటకు వస్తుండగా మార్గమధ్యలో నాయుడుపేట మండలం శ్రీనివాసపురం వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్ళుతున్న లారీని క్రాస్‌చేయబోయి ప్రమాధవశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఉదయ్‌కుమార్,అశోక్‌లు తీవ్రంగా గాయపడ్డారు.పక్కనే ఉన్న స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరళించారు.నాయుడుపేట పోలీసులు కేసునమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి విద్యార్థి కష్టపడి ఇష్టంతో చదవాలి

**విద్యా కమిటీ చైర్మన్ కెవి వెంకటరమణయ్య**



**ఓజిలి, జూన్ 27, ప్రభాతవార్త**

ప్రతి విద్యార్థి కష్టపడి చదివి వారి జీవిత గమ్యాన్ని చేరుకోవాలని విద్యా కమిటీ చైర్మన్ కెవి వెంకటరమణయ్య పేర్కొన్నారు. ఓజిలి మండల పరిధిలోని పెద్దపరియ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులతో, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని అన్నారు. పేదరికం ప్రతిభకు అడ్డుకారాదని తలచి పేదరికంలో ఉండీ ప్రతిభ కలిగిన ఎందరో విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి విద్యకు పెద్ద పీట వేశారని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

## తూర్పుపల్లెల్లో గడప గడపకు మన ప్రభుత్వం

**సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త**

సూళ్లూరుపేట మండల పరిధిలోని కడపత్ర పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కడపత్ర సచివాలయం పరిధిలోని పేర్నాడు, రాగన్నపట్టెడ తదితర గ్రామాల్లో పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చేపడుతున్న పథకాలు వివరించారు. ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటికి అందుతున్న లబ్ధిని వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికి ఆయన్ను ఆశీర్వదిస్తే రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించి సంక్షేమ పాలన కొనసాగిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నేతలు జెట్టి వేణుయాదవ్, చిలకా యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



## సూళ్లూరుపేటలో హెలెన్‌కెలర్ జయంతి

**సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలో దివ్యాంగుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ 143వ జయంతి వేడుకలను ఎన్‌పిఆర్‌డి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పిఆర్‌డి అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతి కోసం పాటుపడిన హెలెన్ కెల్లర్ జయంతిని జరుపుకొని ఆమె స్ఫూర్తితో తమ సంస్థ ద్వారా దివ్యాంగులకు చేతనైన సహాయం చేస్తున్నామని ఆమె చెప్పారు. సూళ్లూరుపేటలో దివ్యాంగుల కోసం ఒక ఆశ్రమాన్ని నిర్మించుకునేందుకు స్థలాన్ని మంజూరు చేయాలని ఆమె కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుంకర ప్రతిమ, వెంకటస్వామి, సుబ్బారెడ్డి, కనకమ్మ, చెంగమ్మ, శివ, యల్లమ్మ, సుబ్బమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమికి తిరున్నామలైకి ప్రత్యేక బస్సులు

**సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త**

జూలై 2వ తేదీన తమిళనాడులోని తిరునామలైకి గురుపౌర్ణమిని పురస్కరించుకొని సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 11 బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మల్లికార్జున మంగళవారం తెలిపారు. ఈ బస్సులు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు తిరునామలైకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండులో రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాను పోను టికెట్లను రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా గ్రామాల నుంచి భక్తులు బయలుదేరాలంటే 30మందికి తగ్గకుండా ప్రయాణికులు ఉంటే ఆ గ్రామం నుంచే బస్సులను సాధారణ ఛార్జీలతో నడుపుతామని మల్లికార్జున చెప్పారు. భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

## తెలుగు తమ్ముళ్ల జోష్

**కోట, జూన్ 27 ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం రాత్రి కోటకు చేరుకున్న సందర్భంగా ఆయన బస చేసిన ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పరిశీలించారు. నాయకులకు, కార్యకర్తలకు దిశ దశ నిర్దేశం చేశారు. రాజకీయ చైతన్యం కలిగిన గూడూరు నియోజకవర్గంలో గత కొంతకాలంగా స్తబ్దుగా ఉండేది. దీంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో కూడా నిరాశ నిస్సహాయత కనిపించింది. అయితే లోకేష్ పాదయాత్ర నియోజకవర్గంలో రెండురోజుల నుంచి కొనసాగుతుండటంతో కార్యకర్తల్లో జోష్ పెరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో అడుగడుగునా లోకేష్‌కు ఘనస్వాగతం లభించింది. మంగళవారం రాత్రి వెంకన్నపాలెం గ్రామం వద్ద సర్పంచ్ మధుయాదవ్ ఆధ్వర్యంలో లోకేష్‌కు ప్రజలు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. బాణాసంచా వేడుకలు, గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు.

## విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరం

**నాయుడుపేట, జూన్ 27 ప్రభాతవార్త**



ఆడపిల్లలకు చట్టాలపై అవగాహన ఎంతైనా అవసరమని నాయుడుపేట జడ్జి సంయుక్త అన్నారు. మంగళవారం నాయుడుపేట మండలం పుదూరులోని గురుకుల పాఠశాలలో ఆమె విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలు సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ అంశంపై అయినా భయంలేకుండా ముందడుగు వేయాలని సూచించారు. దీనికీ భయపడకూడదు, మహిళలకు చట్టం అండగా ఉంటుందని తెలిపారు. మహిళలు అన్యాయాన్ని ఎదిరించాలని సూచించారు. బాలికలు యుక్తవయస్సులో అవగాహనతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అడ్వకేట్లు జివిఎస్‌కె కిషోర్, సోమశేఖర్, చెంగయ్య, బత్తల సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బివిపాలెం, అండగుండలలో జగనన్న సురక్ష కార్యక్రమం

**తడ, జూన్ 27 ప్రభాతవార్త**



తడ మండలం భీములవారిపాలెం, అండగుండల గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేను అధికారులు పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి అయిన జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ దశరధరామిరెడ్డి ఈ సందర్భంగా పలువురు రైతులు, గ్రామస్థులతో మాట్లాడారు. తహశీల్దార్ కార్యాలయంలో సాదాబైనామా ఫైళ్లను పరిశీలించారు. విఆర్‌ఓలతోనూ ఆయన మాట్లాడి తగు సూచనలిచ్చారు. తహశీల్దార్ జెజె రావు, ఎంపిడిఓ ఆమోస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు స్థాపించేందుకు విద్యార్థులకు ప్రోత్సాహం

**గూడూరు, జూన్ 27 ప్రభాతవార్త**




విద్యార్థులకు చదువుతో పాటు పరిశ్రమలు స్థాపించే విధంగా విద్యార్థులను ప్రోత్సాహిస్తూ ముందుకు సాగుతున్న సంస్థ ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల అని ఆదిశంకర విద్యాసంస్థల ఛైర్మన్ వంకి పెంచలయ్య అన్నారు. గూడూరు పట్టణ పరిధిలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో భారత్ అల్టర్నేటివ్ ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ బాంబే వారి సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ఎనర్జీ ట్రాన్స్‌ఫర్ సమ్మిట్-23 నిర్వహించారు. ఈ సమ్మిట్‌లో దేశంలోని పలు కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆదిశంకర్ విద్యాసంస్థల ఛైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ నేడు కళాశాలలో నిర్వహించిన సమ్మిట్‌లో దాదాపు 30 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. ఆదిశంకర్ కళాశాల నుంచి స్టార్టప్ కంపెనీగా నపారంభమైన భారత్ ఆల్టర్నేటివ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ బాంబే కేంద్రంగా దేశంలో ఐదు ప్రాంతాల్లో ప్రాజెక్టులు దిగ్విజయంగా పూర్తి చేశారని, మూడు రకాల ఎలక్ట్రికల్ మోటార్ వెహికల్స్ విజయవంతంగా రూపొందించారని తెలిపారు. విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన కల్పిస్తూ సొంతంగా వారు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హెచ్ఓడీలు ఏవో రామయ్య, విద్యార్థులు, పలు పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల్లో ప్రజలను భాగస్వాములు చేయాలి

**- డ్వామా పీడీ సి.వి.శ్రీనివాసప్రసాద్**



**గూడూరు, జూన్ 27 ప్రభాతవార్త**

గూడూరు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో అధ్యక్షతన తిరుపతి డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జడ్పీటీసీ యామిని ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 2022 నుంచి 2023 వరకు చేపట్టిన పనులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఎన్ఆర్ఇజిఎస్ పనుల కింద వివిధ రకాల పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. తిరుపతి డ్వామా పీడీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పలు పనుల్లో తేడాలు కనిపించడంతో నిర్లక్ష్యం వహించిన వారికి పెనాల్టీతో పాటు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు యామిని, ఎస్ఆర్‌పి ఆవులయ్య, వేణుగోపాల్, ఏవో మురళీ, ఏపీవో గిరిబాబు, , నూతన ఏపీవో ఎస్.రెడ్డప్ప, సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బిసిలు యువగళం యాత్రకు పెద్ద ఎత్తున తరలిరావాలి



**చిల్లకూరు, జూన్ 27, ప్రభాతవార్త**

తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు చిల్లకూరు మండలంలోని బిసిలందరూ తరలి రావాలని చిల్లకూరు మండల బిసి సంఘం అధ్యక్షులు మేకల కుమార్ తెలిపారు. మంగళవారం చిల్లకూరులో విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ ఈ నెల 29,30 తేదీల్లో జరుగు యువగళం పాదయాత్రకు గూడూరు నియోజకవర్గం ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందంటే అది తెలుగు దేశం పార్టీ హయాంలోనే అని వారు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బిసిలందరూ కలిసి కట్టుగా యువగళం యాత్రలో పాల్గొనాలన్నారు. వెంకటగిరి, సూళ్ళూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీలు దగ్గరుండి యువగళం యాత్ర విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారని, 2024లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, గూడూరులో ఎమ్మెల్యేగా పాశం సునీల్ కుమార్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని వారు బిసిలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేరెంట్స్ కమిటీ సమావేశాలు తప్పనిసరి

**నగరి, జూన్ 27 ప్రభాతవార్త:**

నగరి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈవోలు శ్రీదేవి, నమ:శివాయం అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆమె సమావేశమయ్యారు. ఆమె జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి సూచించిన విషయాలపై చర్చించారు. అన్ని యాజమాన్య ప్రాథమిక ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ మీటింగ్ తప్పని సరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. మండల అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొని ప్రత్యక్షంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. కనుక ముందస్తు ఏర్పాటులో భాగంగా పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆహ్వానం పంపి సమావేశం నిర్వహించాలని సూచించారు. పాఠశాల సమయపాలన, అకడమిక్ క్యాలెండర్, హెచ్ఎం టైం టేబుల్ తప్పని సరి అన్నారు.

## ఎంఎల్‌సి శ్రీకాంత్‌కు సన్మానం

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 27 ప్రభాతవార్త



ఇటీవల జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో గెలిచిన శ్రీకాంత్ మంగళవారం తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఇంటిలో మర్యాదపూర్వకంగా బొజ్జల బృందమ్మను కలసి ధన్యవాదాలు తెలిపారు. మొదటి సారి శ్రీకాంత్ ఊరందూరు గ్రామానికి వచ్చిన సందర్భంగా బృందమ్మ దుశ్శాలువతో సత్కరించారు. రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పార్టీ ప్రణాళికను ప్రజల్లోకి తీసుకెళ్ళటంలో కృషి చేయాలని బృందమ్మ సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, పాలసరఫరామాజీఛైర్మన్ మునిరాజనాయుడు, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో బక్రీద్ నమాజు వేళలు

శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో బక్రీద్ పండగ సందర్భంగా వివిధ ఈద్గాహ్‌లలో నమాజు సమయాలను ముప్తి నయిం సాహెబ్ వివిధ పరిశీలనల తరువాత మంగళవారం ప్రకటించారు. బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ ఇచ్చే సంప్రదాయం ఉంది కాబట్టి ఉదయం 9గంటల లోపల నమాజులు పూర్తి చేసుకునే రీతిలో ఏర్పాట్లు చేసామన్నారు. ఈ మేరకు రాజీవ్‌నగర్‌లోని ఈద్‌గాహ్‌లో ఉదయం 6.30గంటలకు ప్రసంగం ప్రారంభించి 7గంటలకు నమాజు చదువుతారని అలాగే జామియా మస్‌జిద్‌కు సంబంధించి ఈదుల గుంటలోని ఈద్‌గాహ్‌లో ఉదయం 8గంటలకు ప్రసంగం ప్రారంభమౌతుందని 8.30గంటలకు నమాజు చదవబడుతుందన్నారు. అలాగే మక్కామస్‌జిద్‌కు సంబంధించిన అయ్యలనాడు చెరువులోని ఈద్‌గాహ్‌లో ఉదయం 8.30గంటలకు ప్రసంగం ప్రారంభించి 9గంటలకు నమాజు చదువ బడుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అందరూ ఈద్ ప్రార్థనల్లో పాల్గొనాలనే ఉద్దేశ్యంతోఈ సమయాలను నిర్ణయించినట్లు ముప్తి నయిం సాహెబ్ వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

శ్రీకాళహస్తి రూరల్, జూన్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం వాంపల్లి వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ గాయపడినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. సిఐ అజయ్‌కుమార్ అందించిన సమాచారంమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు నుంచి నెల్లూరుకు వెళుతున్న పెట్రోల్ ట్యాంకర్ నెల్లూరు పోర్టు నుంచి కోడూరుకు వెళుతున్న లారీని వెనుక భాగంలో ఢీకొన్నట్లు వివరించారు. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కావటంతో వెంటనే ఆతన్ని తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## గాయపడ్డ యువకుడు మృతి

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం రామాపురం రిజర్వాయర్ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వెంకటేష్ (26)ను వెంటనే శ్రీకాళహస్తలోని ఓ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స జరిపి తిరుపతికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం అయితే పోలీసులకు ఎలాంటి పిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు. మృతి చెందిన వెంకటేష్ తొట్టంబేడు మండలం బోనుపల్లికి చెందిన యువకుడుగా గుర్తించారు.

## యువతి అదృశ్యం-కేసు నమోదు

శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని భాస్కరపేటకు చెందిన మురుగన్ కుమార్తె శ్వేత(17) తిరుపతిలోని ఓ కళాశాలలో చదువుతోంది. శనివారం కళాశాలకు వెళ్ళిన కుమార్తె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు ఇండ్లలో వెదికినా కనిపించకపోవడంతో మంగళవారం టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదుచేశారని దీంతో కేసు నమోదుచేసినట్లు సిఐ మల్లికార్జున, ఎస్ఐ మహేష్‌బాబులు తెలిపారు. యువతి ఎక్కడైనా కనిపిస్తే వెంటనే టుటౌన్ సిఐ 9440900008, ఎస్ఐ 91541 41887 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

## శివయ్య సన్నిధిలో విద్యాశాఖ డైరెక్టర్

శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి మంగళవారం ప్రభుత్వ పాఠశాలల పరీక్షల విద్యాశాఖ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి కుటుంబసభ్యులతో విచ్చేశారు. వీరికి విద్యాశాఖ అధికారులు ఆర్.భువనేశ్వరి, బాలయ్యలతో కార్యాలయ సిబ్బంది ప్రశాంత్‌లు ఆలయంలో స్వాగతం పలికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం అనంతరం పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించి సత్కరించారు.

## బుతుచక్ర పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం

తిరుపతి (విద్య), జూన్ 27, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం, విభాగం వారి ఆధ్వర్యంలో మెనిస్ట్రియల్ హైజిన్ అనే అంశం పైన ఎంసిహెచ్ స్కూల్ దొడ్డాపురం స్ట్రీట్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. అందుకు గాను ప్రతి మహిళలకు అవగాహన తప్పనసరి అని మెనిస్ట్రియల్ హైజిన్ పాటించకపోతే చిన్న చినన ఇన్ఫెక్షన్‌తో ప్రారంభమై అది శారీరమంతా వ్యాపించి చివరకు అది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుందని మహిళా అధ్యయన కేంద్ర డాక్టర్ కె. రాణి వివరించారు. ముఖ్యంగా ప్రపంచ మెనిస్ట్రియల్ హైజిన్ డే అయిన మే 28వ తేది యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంసిహెచ్ స్కూల్ అధ్యాపకులు, మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్స్ ఇంద్రాణి ప్రీతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెట్రోల్ అడిగి దోపిడి

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్) జూన్ 26 ప్రభాతవార్త

మండలంలోని సదాశివపురం గ్రామంలో మంగళవారం ఉదయం పెట్రోల్ కావాలని దుకాణం వద్దకు వచ్చి మహిళ మెడలోని బొందుచైను లాక్కెళ్ళిన సంఘటన చోటు చేసుకుంది. ఏర్పేడు సిఐ శ్రీహరి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సదాశివపురం గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి కిరాణ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం వేకువ జామున దుకాణం తీయగా ఆతని భార్య కూడా తోడు ఉంది, ఓ గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి పెట్రోల్ కావాలని కోరగా సుధాకర్‌రెడ్డి లోపలకు వెళ్ళగా దుకాణంలో ఆతని భార్య సులోచన(58) ఉండగా మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బొందారం మూడు సవర్ల బంగారు విలువ 72వేలు లాక్కెళ్ళినట్లు పిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు వివరించారు.

## పిల్లల భవిష్యత్తుకు భద్రత..టాటా ఏఐఏ ఇన్సూరెన్స్

తిరుపతి ప్రెస్‌క్లబ్, జూన్ 27 ప్రభాతవార్త:

ప్రముఖ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఒకటైన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ అనేది పిల్లల భవిష్యత్తుకు భద్రతను ఇస్తోందని ఆ సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గిరీస్ కల్రా తెలిపారు. తమ సంస్థ వినూత్న రీతిలో డిజిటల్ ప్రచారంలో భాగంగా ప్రత్యేక డిజిటల్ చిత్రాన్ని రూపొందించిందన్నారు. కుటుంబంలోని ప్రియమైన, బాధ్యతాయుతమైన ప్రదాతగా ఉండటంలో కీలకమైన భాగంగా ఉంటూనే..ఆర్థిక సదుపాయం ప్రాముఖ్యతను ప్రచార చిత్రం నొక్కి చెబుతుందన్నారు. ఇది ఒక కొడుకు ప్రయాణాన్ని ప్రదర్శిస్తుందన్నారు. అతను తన తండ్రి మాయా జేబు ద్వారా తన కలలను నెరవేర్చుకోవడాన్ని ఎల్లప్పుడూ చూస్తుంటాడు. అది సైకిల్ కావచ్చు, కలల సెలవులు కావచ్చు లేదా అతని ఎంబిఏ విద్య కావచ్చు. అతను స్వయంగా తండ్రి అయినప్పుడు, అతని మాయా జేబు నిజమైన రహస్యాన్ని అతని తండ్రి బయట పెడతాడన్నారు. ఫారెస్ట్ ఫిల్మ్ అభివృద్ధి చేసి, నిర్మించిన ఈ చిత్రంలో తండ్రి పాత్రలో అత్యంత డిమాండ్ ఉన్న నటులలో ఒకరైన రజత్‌కుమార్ నటించారన్నారు.

## ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో స్మశాన వాటికలు ఏర్పాటుకు చర్యలు

– జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో అవసరమైన చోట్ల స్మశాన వాటికలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. కలెక్టరేట్ నుండి మంగళవారం జెసి శ్రీనివాసులు డిఆర్ఓ రాజశేఖర్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో స్మశాన వాటికల ఏర్పాటు, 22ఎ, ఎపిసేవ, మీసేవ, రీసర్వేపై ఆర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, డిఐఓలు, విఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు సంబంధించి సత్వరం భూములు గుర్తించాలని తహసిల్దార్లను ఆదేశించారు. అలాగే 22ఎ కేసులకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎలాంటి పెండింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎపి సేవలు, మీసేవకు సంబంధించి ఎక్కడ పెండింగ్ లేకుండా అన్నింటిని జిరో చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జెసి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఎడి గౌస్‌భాషా, శిక్షణ కలెక్టర్ కిరణ్మయి, మురళీ, వాసు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## వారెవ్వా..." మారవా " చేప...!

చౌడేపల్లి, జూన్ 27 ప్రభాతవార్త



పొదలపల్లికి సమీపంలోని పంజానిఒడ్డులో మారవచేప అతిపెద్దగా వుండి అందరినీ ఆకర్షించింది. సాధారణంగా మారవను చేపల్లో రారాజుగా పిలుస్తారు. పంజానిఒడ్డులో లక్ష్మీనారాయణ కంట పడిన ఈ మారవచేప దాదాపు 30కిలోల బరువుండి 4అడుగుల పొడవుంది. పెద్దగా వున్న చేపను చూసేందుకు గ్రామస్తుల ఆసక్తి కనబరచారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

నగరి, జూన్ 27 ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్.వెంకటేశన్ రూ.5 వేలు విలువగల అభ్యసనా సామగ్రిని వితరణగా అందించారు. మంగళవారం పాఠశాలలోని 1వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిల్, రబ్బర్ ఆయన వితరణగా అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో ఉత్తరా నక్షత్ర పూజలు

నగరి, జూన్ 27 ప్రభాతవార్త:



పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపం గల శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్పస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్చరిస్తూ భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు ప్రేమలత, కృపానిధి, సత్య, రమేష్ ఉభయదారుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గురుస్వామి, మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, రమేష్‌బాబు, దుర్గాప్రకాష్ స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక రాజ్య బీమా ఆసుపత్రికి వైద్య పరికరాల వితరణ

తిరుపతి కలెక్టరేట్, జూన్ 27, ప్రభాతవార్త



తిరుపతి కార్మిక రాజ్య భీమా ఆసుపత్రి ఫిజియోథెరపీ వైద్య విభాగానికి వారి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరికరాలు వితరణ మంగళవారం నిర్వహించారు. కాల్ రేడియో ప్రతినిధులు శ్రీధర్, యోగేశ్వర్ పాల్గొని రెండు లక్షల రూపాయిలు విలువైన లేజర్ థెరఫీ, అనాలజిసిక్ పల్సర్, పిఈఎంఎఫ్, ఐఎఫ్‌టి పరికరాలను ఫిజియోథెరఫీ విభాగానికి అందించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. కె. శ్రీధర్, డా. ఏవిఎస్ ప్రసాద్, డా. సి. సునీత, డా. బిఎస్ నోయల్ వినోద్, ఫిజియోథెరపిస్ట్ అమ్ములు, ఇతర వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఫిజియోథెరఫీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాకు నవీకరణకు సహకరించండి

తిరుపతి ఎన్నికల అధికారి హరిత

తిరుపతి కార్పొరేషన్, జూన్ 27, ప్రభాతవార్త

తిరుపతి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేరికలపై సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తిరుపతి నియోజకవర్గ ఎన్నికల అధికారి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత కోరారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలైలో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులకు అవకాశం కల్పిస్తూ స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమం దేశ వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేస్తూ తిరుపతి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో సవరణలు మార్పులు కోసం జూలై 21వ తేది నుండి ఆగష్టు 21 వరకు బిల్వోస్ ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలిస్తారన్నారు. సమావేశంలో పాల్గొన్న రాజకీయ ప్రతినిధులు మాట్లాడుతూ ఓటర్ల నమోదుకు ప్రచారం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో తిరుపతి అర్బన్ ఎంఆర్ఓ వెంకటరమణ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డిటి జీవన్, వైసిపి, తెలుగు దేశం, బిజెపి, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

వడమాలపేట, జూన్ 27 ప్రభాతవార్త:



మండల పరిధిలోని ఎస్వీ పురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 25 వేల రూపాయలు విలువ చేసే విద్యా సామగ్రిని మంగళవారం దాత శ్రీనివాసరాజు అందజేశారు. స్థానికుడైన శ్రీనివాసరాజు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పని చేస్తున్నారు. తన తల్లి ధనలక్ష్మి వర్ధంతి సందర్భంగా పాఠశాలలోని 125 మంది విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, ప్యాడ్లుఅందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఉపాధ్యాయులు శ్రీధర్‌రాజు, రంగయ్య, సుదర్శన్, నరసింహులు, సూర్యప్రకాష్, కోమలరాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సచివాలయాల్లో జగనన్న సురక్ష శిక్షణ తరగతులు

పుత్తూరురూరల్, జూన్ 27 ప్రభాతవార్త:

పుత్తూరు రూరల్ నేసనూరు, రామకృష్ణాపురం, తడుకు సచివాలయాలకు చెందిన వలంటీర్లు, గృహ సారథులకుస్థానిక సచివాయాల్లో రాష్ట్ర ప్రభుత్వం మంత్రి రోజా ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమాలు జరిగింది. ఎఫ్‌వోఏ, ఎంఎల్‌వో, జేసీఎస్ కన్వీనర్ ద్వారా వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, సర్పంచ్‌లు గోవిందస్వామిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మురళి, ఎఫ్‌వోఏ, ఎంఎల్‌వో దిలీప్ మొదలి, కన్వీనర్ల మస్తాన్, శ్రీనివాసులు, మధు, తిరుమలరెడ్డి, చక్రవర్తి, రామూర్తిరెడ్డి, బాబు, వీరస్వామి, గృహ సారథులు తదితరులు పాల్గొని జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరించారు.

## ఇళ్ళలో రాత్రి దొంగతనం చేసే దొంగల అరెస్టు

తిరుపతి క్రైం, జూన్ 27, ప్రభాతవార్త



ఇళ్ళలో రాత్రి దొంగతనం చేసే దొంగలను అరెస్టు చేసిన్నట్లు ఎస్పి పరమేశ్వర రెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్పి పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ తిరుపతి పరిసరప్రాంతాలలో ముత్యాలరెడ్డిపల్లి, అలిపిరి, బైరగిపట్టడా, వెంకటగిరి, గూడూరు వంటి టౌన్ ఏరియాలో రాత్రి వేల ఇంటి దొంగతనం, అలాగే ఒంటరిగా వెళ్తున్న మహిళా మెడలోని బంగారు నగలు, చైన్లు లాగుకొని వారిని బెదిరించి దొంగతనం చేయు పాత నేరస్తులు అక్కుర్తి పెంచలయ్య, అక్కుర్తి నవీన్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు 12,50,000 రూపాయిలు విలువ గల 225 గ్రాముల బంగారు నగలు అర కేజీ వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసిన్నట్లు ఎస్పి పేర్కొన్నారు.

## అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయురాలు మృతి

తొట్టంబేడు, జూన్ 27 ప్రభాతవార్త



మండలంలోని చిలకావారికండ్రిగ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యురాలుగా పనిచేస్తున్న యం.దినమణి(61) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణకైలాస్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆమె గత కొంతకాలంగా సెలవులో ఉంటూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఈసందర్భంగా ఆమె మృతికి ఎంఈవో సిహెచ్ఎం భారతీ, సీనియర్ ప్రధానోపాధ్యాయులు మార్టిన్, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## షిరిడిసాయి మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవం

తొట్టంబేడు, జూన్ 27 ప్రభాతవార్త

కాసరం పంచాయతీ రాంబట్లపల్లి గ్రామంలో వెలసిన షిరిడిసాయి మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాన్ని వచ్చేనెల 3వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కె.మహదేవరెడ్డి తెలిపారు. ఈనెల 3వతేదీన ఆలయంలో ఉదయం 7 నుంచి 10గంటల వరకు సాయినాథునికి పాలాభిషేకం, అనంతరం భజన కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పల్లకీలో షిరిడిసాయినాథుని గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు.

## ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త



సమాజంలో ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందినపుడే కుటుంబం ప్రశాంతంగా ఉంటుందని వైకాపా నాయకురాలు పవిత్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె శ్రీకాళహస్తి దేవస్థానం పరిధిలో మహిళలు ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను ప్రారంభించారు. ఈ బజార్‌లో మహిళలచే తయారు చేసిన వస్తువులను ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఈ ప్రదర్శనను ప్రారంభించిన పవిత్రారెడ్డి స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వస్తువుల్ని పరిశీలించి కొనుగోలు చేసారు. ఈ సందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ నేటి పరిస్థితిలో ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని పిలుపు నిచ్చారు. ప్రతి మహిళకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకంగా ఎన్నో వెసులుబాట్లు కల్పిస్తుందన్నారు మహిళలు ఇంటివద్దనే ఉంటూ ఖాళీ సమయాల్లో జ్యూట్‌బ్యాగులు, మగ్గం వర్కులు, కుట్టుశిక్షణ, సబ్బుల తయారి తదితర వస్తువులను తయారిలో శిక్షణ తీసుకొని ఉపాధిపొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మెప్మా సిఒ ప్రసాద్, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## యువత మాదకద్రవ్యాలతో జాగ్రత్తగా వహించాలి

సెట్విన్ సిఇఓ డా.వి. మురళీ కృష్ణ

తిరుపతి (క్రీడ), జూన్ 27, ప్రభాతవార్త



యువజన సర్వీసుల శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లాల యువజన సర్వీసుల శాఖ సెట్విన్ ఆధ్వర్యంలో ఎమ్రాల్డ్స్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్విన్ సిఈఓ డా. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 26వ తేది మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నేషనల్ డే అగైనెస్ట్ డ్రగ్ అబ్యూస్ అండ్ అలిక్ట్ ట్రాఫికింగ్ జరుపుకుంటున్నారన్నారు. డ్రగ్ అబ్యూజ్ లేని సమాజాన్ని సాధించడమే యొక్క లక్ష్యం. ఈ లక్ష్య సాధనకి ప్రభుత్వం, సంస్థలు, కుటుంబాలు, వ్యర్తులు, విద్యార్థులు, యువత అందరూ కలిసి పని చేయాలని తెలిపారు. సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్ విద్యార్థుల చేత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్రాల్డ్స్ డిగ్రీ కళాశాల, తిరుపతి వారి సిబ్బంది, విద్యార్థులు, సెట్విన్ కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈద్గా మైదానాన్ని పరిశీలించిన తిరుపతి ఎమ్మెల్యే భూమన

తిరుపతి కలెక్టరేట్, జూన్ 27, ప్రభాతవార్త

తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మంగళవారం ఉదయం తిరుపతి ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. బక్రీద్ సందర్భంగా ముస్లీం సోదరులు ప్రార్థనలు నిర్వహించుకోవడానికి వీలుగా మెరుగైన సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈద్గా మైదానంలో పిల్లలతో కలిసి క్రికెట్ ఆడాడు. వారికి చాక్లెట్లు పంచిపెట్టి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తిరుపతిలో హిందూ, ముస్లీం కుటుంబాలన్నీ తరతరాలుగా అత్యంత ఆత్మీయ అనుసంధాలను ఏర్పరచుకున్నాయని తెలిపారు. సోదర, సోదరి భావనతో, అందరూ ఒక్కటే అనే భావనతో తిరుపతి పట్టణం ఉందన్నారు. ముస్లీం సోదరులు అత్యద్భుతంగా నిర్వహించనున్న బక్రీద్ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రార్థనలు చేయటానికి జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగిందని వివరించారు. పారిశుద్ధ్య పనులు మెరుగ్గా నిర్వహించి, ఈద్గా మైదానంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె బాబు, నగర పాలక సంస్థ కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, కోటూరు ఆంజనేయులు, ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఖాదర్ భాషా, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె ఇమామ్, నాయకులు రఫీ, ఇమ్రాన్ మాలిక్, ఇస్మాయిల్, చాంద్ భాషా నగర పాలక సంస్థ డిఈ రవీంద్ర పాల్గొన్నారు.

## స్పందనపై స్పందించని ఇద్దరు కార్యదర్శులను సస్పెండ్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 27, ప్రభాతవార్త



స్పందనపై, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత హెచ్చరికలు జారీ చేసారు. తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని 10వ వార్డు సచివాలయంలోని వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ కె. కిషోర్ బాబు స్పందన గ్రీవెన్స్‌ని ఈ నెల 23వ తేది నుండి ఎగ్జిక్యూటీవ్ అథారిటీ వారు పలుమార్లు హెచ్చరించనను, సమస్యను పరిష్కరించక కాలయాపన చేసినందున, అదే విధంగా రాజీవ్ నగర్ జీవకోన 46/1 వార్డులోని కె. ఆనంద్, అమినిటీస్ సెక్రటరీ, స్పందన నందు వచ్చిన గ్రీవెన్స్‌కి సమాధానంను ఎగ్జిక్యూటీవ్ అథారిటీ వారి అనుమతి పొందక అతనే స్పందన పోర్టల్ నందు నిర్లక్ష్యముగా సమాధానంను అప్లోడ్ చేసినందున సదరు గ్రీవెన్స్ మరలా రీ ఓపెన్ అయి స్పందన ఆడిట్‌నందు మరలా వచ్చినందున ఇతననిని కూడా సస్పెండ్ చేస్తూ కమిషనర్ అర్డర్ ఇవ్వడం జరిగింది. కావున వార్డు సచివాలయ పరిధిలోని అందరు వార్డు సెక్రటరీలు స్పందన గ్రీవెన్సులకు మానిటరింగ్ చేసుకుని పరిష్కరించవల్సిందిగా కోరడమైనదని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత సూచించారు.

## జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

వడమాలపేట, జూన్ 27 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ నోడల్ అధికారి జిల్లా సెరికల్చర్ ఆఫీసర్ గీతారాణి సూచించారు. మంగళవారం వడమాలపేట మండల శ్రీ బొమ్మరాజపురం గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్ల ద్వారా జరుగుతున్న ఇంటింటా సర్వేను ఆమె తనిఖీ చేశారు. ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రయోజనాలను, ఉపయోగాలను తెలియజేశారు. ఇందులో మండల పరిషత్ అభివృద్ధి అధికారి భానుమూర్తిరావ్, పరిపాలనాధికారి శేఖర్, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, వీఆర్‌వో చక్రవర్తి, వలంటీర్లు పాల్గొన్నారు.

## విస్తృతంగా కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

డ్వామా పిడి గంగా భవానీ

నింద్ర, జూన్ 27 ప్రభాతవార్త :



విస్తృతంగా కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పిడి గంగాభవానీ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని సియల్‌ఆర్‌సి భవనంలో ఉపాధి హామి పనులుపై సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామి పనులు గణనీయంగా చేపట్టి ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇందులో యస్‌సి, యస్‌టి, దివ్యాంగులకు తప్పనిసరిగా పని కల్పించాలన్నారు. ఉపాధి పనికి రాని వారిని గుర్తించి పని వచ్చేలా చైతన్య పరచాలన్నారు. కూలీలకు పనులు కల్పించి నిర్దేశించిన పని దినాల లక్ష్యాన్ని ప్రతి క్షేత్ర సహాయకులు చేరుకొవాలన్నారు. ఎపిడి శోభన్‌బాబు, ఆరు మండలాల ఎపిఓలు, జేఇలు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి అభ్యర్థి పులివర్తి నాని విజయమే లక్ష్యం..!

గ్రామ స్థాయిలో వంద శాతం బోగస్ ఓట్లను ఏరివేయాలి

టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, జూన్ 27 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నాని విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఐతేపల్లి, అగరాల, కొటాల పంచాయతీలలో మంగళవారం క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బోగస్ ఓట్లను నిశితంగా పరిశీలించి వంద శాతం ఏరివేయాలని అన్నారు. సమర్థవంతంగా సాంకేతికతను అందిపుచ్చుకుని హౌస్ మ్యాపింగ్ పక్కాగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు దేవుడు మదన్న

రేణిగుంట, జూన్ 27 ప్రభాతవార్త:

ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేద ప్రజలకు దేవుడితో సమానమని ఎస్సీ నాయకురాలు అరుణ అన్నారు. అరుణ మాట్లాడుతూ ఎండా, వాన, చలిని సైతం లెక్క చేయకుండా రాత్రి, పగలు తేడా లేకుండా నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్న మధుసూదన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ప్రతిపక్షనేతలకు లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఆయన అందిస్తున్న సహాయ సహకారాలు ఇంతకు ముందు ఎవరూ చేయలేదన్నారు.

## గిడ్డంగుల వల్ల రైతులు లాభాలు పొందవచ్చు - నవీన్ కుమార్

రేణిగుంట, జూన్ 27 ప్రభాతవార్త:



గిడ్డంగుల వల్ల రైతులు అధిక లాభాలు పొందవచ్చునని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్(ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డా. శ్యామ్ కుమార్ అన్నారు. జిల్లా సహకార అధికారి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన రేణిగుంట విమానాశ్రయ మార్గంలోని కేంద్ర గిడ్డంగుల వద్ద రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో శ్యాంకుమార్ మాట్లాడుతూ రైతులు తమ పండించిన పంటను అప్పటికప్పుడు అమ్ముకుంటే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గిడ్డంగుల్లో భద్రపరచుకుని పండించిన ధాన్యానికి ఎక్కువ ధర ప్రభుత్వాలు రైతుల ప్రయోజనాల కోసం గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సులో పీఏసీఎస్(మల్లగుంట) అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, సహకార శాఖ, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపిబిసి ఆధ్వర్యంలో ఎంపి గురుమూర్తికి ఘనంగా వీడ్కోలు

తిరుపతి ప్రెస్‌క్లబ్, జూన్ 27 ప్రభాతవార్త:



తిరుపతి పార్లమెంట్ సభ్యుడు డా॥గురుమూర్తి విదేశీ పర్యటన సందర్భంగా మంగళవారం ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డా॥ప్రవీణ్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో అక్కడ శాంతిని నెలకొల్పే దిశగా పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు. అనంతరం బిషప్స్ కౌన్సిల్ సభ్యులు ఎంపికి అంతా మంచి జరగాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి బిషప్ వానాల దేవిడ్ రాజు, కోశాధికారి బిషప్ రెబ్బ విక్టర్ పాల్, జాయింట్ సెక్రటరీ బిషప్ మోజెస్, ఈసి మెంబర్లు బిషప్ నవీన్‌కుమార్, బిషప్ మోజెస్ పరమశివం, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

